ఇంటర్ పరీక్షలు ప్రారంభం



దేవరకద్రలో హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం జిల్లా వ్యాప్తంగా సజావుగా ప్రారంభమయ్యాయి. జడ్చర్లలో మొత్తం నాలుగు కేంద్రాల్లో 1,352 మంది విద్యార్థులకు గానూ 1,274 మంది హాజరయ్యారు. 78 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 590 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 30 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు ఉరుకులు పరుగులతో పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 297 మంది విద్యార్థులకు గాను 287 మంది హాజరయ్యారు.

భూత్పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు 248 మంది విద్యార్థులకు 238 హాజరైనట్లు ప్రిన్సిపాల్ విజయభాస్కర్ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ చెన్నకిష్టన్న పరిశీలించారు.



జడ్చర్లలో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 153 మంది విద్యార్థులకు గాను 141మంది పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కోదండ రామయ్య తెలిపారు. ఒకేషనల్‌లో 78 మందికి గాను 70 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

కోయిల్‌కొండ: పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ప్రేమ్‌రాజ్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలను ఆయన పరిశీలించారు. 413మంది విద్యార్థులకు గాను 395 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ బాలనారాయణ తెలిపారు.



కోయిల్‌కొండలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రేమ్‌రాజ్

మహమ్మదాబాద్: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు ఉమ్మడి మండల వ్యాప్తంగా నంచర్ల గురుకుల పాఠశాలలో 536 మంది విద్యార్థులకు గాను 519 మంది విద్యార్థులు హాజరయ్యారు.

పంటలసాగులో జాగ్రత్తలు తప్పనిసరి

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో బుధవారం పంటల నమోదును జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ పరిశీలించారు. రైతులు ఏ పంటలు సాగు చేశారు, ఎన్ని రకాల్లో పంటల సాగు చేశారో వివరాలను ఏఓ మురళీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ హర్షవర్ధన్ ఉన్నారు.

కోయిల్‌కొండ: రైతులు పొట్టదశలో ఉన్న వరి సాగులో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రాంపాల్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లవల్లిలో రైతు కృష్ణారెడ్డి వేసిన వేరుశనగ, వరిసాగును ఆయన పరిశీలించారు. వరి పొట్ట దశలో ఉందని 20–25 కిలోల యూరియా, 10–15 కిలోల పొటాష్ ఎకరాకు చల్లుకోవడం ద్వారా పంటలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. జింక్ లోపం కనిపించిందని, చిల్లెట్ జింక్‌ను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్

సైబర్ నేరాలపై అప్రమత్తత ముఖ్యం

భూత్పూర్: సైబర్ నేరాలు అధికంగా అవుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని భూత్పూర్ సీఐ రజితారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తాటిపర్తి కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి కుటుంబ సభ్యుల వివరాలు, వారు చేస్తున్న పనులు, వాహనాలకు సంబంధించిన పేపర్లను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించి ఎలాంటి పేపర్లు లేకుండా నడుపుతున్న 6వాహనాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామస్తులు, యువకులతో సైబర్ నేరాలు జరుగుతున్న తీరును సీఐ రజితారెడ్డి వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి



పీయూలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉద్యోగాల భర్తీలో పేపర్ లీక్ కావడంపై పాలమూరు యూనివర్సిటీలో ఏబీవీపీ నాయకులు బుధవారం టీఎస్‌పీఎస్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నరేష్, తేజ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో కోటీ 90లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి మోసం చేయగా, ఇచ్చిన నోటిఫికేషన్లలో అక్రమాలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. ఇందుకు సీఎం బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అర్జున్, శోభన్, విజయ్, శరత్, అజయ్, ప్రవీణ్, అశోక్, పవన్, అంజి పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ నాయకుల నిరసన..

టీఎస్‌పీఎస్సీలో జరిగిన అక్రమాలపై వెంటనే సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మేరకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన కారక్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లక్ష్మణ్, కృష్ణ, శేఖర్, సురేష్, సంతోష్, రాము పాల్గొన్నారు.

యువకులపై కేసు నమోదు

హన్వాడ: మండలంలోని మునిమోక్షం పల్లెప్రకృతివనం ప్రహరీ, శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి నాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మునిమోక్షం గ్రామానికి చెందిన మాలె రోహిత్ రెడ్డి, శ్రీను అనే యువకులు గ్రామంలోని పల్లె ప్రకృతివనం ప్రహరీని, శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. కాగా, ఈ సంఘటన జరిగి నెల రోజులు కావస్తున్నదని తెలిపారు. మాలె రోహిత్‌రెడ్డిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుట్ర రాజకీయాలు మానుకోవాలి..

తనపై అక్కసుతోనే మిత్రుడు రోహిత్‌రెడ్డిని కిడ్నాప్ చేసి అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని ఉద్యమ నాయకుడు మున్నూరు రవి మున్నూర్‌రవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు మద్దతుగా నిలిచిన వారి మీద కుట్రలు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

భక్తిశ్రద్ధలతో ద్వారకామాయి బ్రహ్మోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం జెడ్పీ కార్యాలయం సమీపంలోని ద్వారకామాయి బాబా మందిరం పంచమదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం కాగడహారతి, మహాగణపతిపూజ, అఖండ దీపారాధన, బాబావారికి రుద్రాభిషేకం, గౌరిపూజ, స్వస్తిపుణ్యాహ వాచనం, రక్షబంధన, ప్రధాన కలశ పూజ నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాలపూజ, సాయి సంధ్యాహారతి, శేజారతి పూజలు చేశారు. వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 17వ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



కలశ పూజలు నిర్వహిస్తున్న పూజారులు

ఘనంగా కాన్షీరాం జయంతి



జైభీమ్ చౌరస్తాలో కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: భారత రాజకీయ శాస్త్రవేత్త బహుజన రాజ్యాధికార స్థాపకుడు మాన్యశ్రీ కాన్షీరాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు జైభీమ్ చౌరస్తాలో జ్ఞాన నీలి మెరుపు బహుజన మహనీయుల శోభయాత్ర కమిటీ ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్ మాట్లాడుతూ కాన్షీరాం అంబేడ్కర్ రాసిన కుల నిర్మూలన గ్రంథాన్ని చదివి అగ్రకుల ఆధిపత్యం జీర్ణించుకోలేక కుటుంబాన్ని, ఉద్యోగాన్ని సైతం వదులుకొని బడుగుల రాజ్యాధికారం లక్ష్యంగా ఉద్యమించారని గుర్తుచేశారు. వైఎస్సార్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రవిప్రకాష్ మాట్లాడుతూ కాన్షీరాం లక్ష్యం కులాన్ని నిర్మూలిద్దాం బహుజన సమాజాన్ని సాధిద్దామని దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో శోభయాత్ర కమిటీ కన్వీనర్ రమేష్, కో–కన్వీనర్లు నరేందర్, అశోక్, యాంకి రమేష్, దిలీప్‌కుమార్, దినేష్, ఎల్.రమేష్, తిరుమలయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

హన్వాడ: 'సాక్షి' దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'అంగన్‌వాడీ కేంద్రానికి తాళం ' అనే శీర్షికపై స్పందించిన సూపర్‌వైజర్ యాదమ్మ మూతపడిన కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఐదు రోజులుగా కేంద్రానికి తాళం వేసి విషయంపై వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, అంతా సవ్యంగా ఉన్నట్లు వివరించారు. సంబంధిత టీచర్ కేంద్రాన్ని 3గంటలకు తాళం వేసి పంచాయతీ కార్యాలయంలో తోటి అంగన్‌వాడీ టీచర్లతో కలిసి సర్వే పనుల్లో నిమగ్నమైనట్లు పేర్కొన్నారు. కాగా, స్థానికులు మాత్రం అంగన్‌వాడీ కేంద్రం మూతపడినట్లు తెలిపారు. కేంద్రాల పనితీరును చక్కదిద్దాల్సిన అధికారులే ఇలా వ్యవహరించడం సరికాదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ పెంచాలి



జాతీయ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వ రంగ సంస్థల ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ పెంచాలని జాతీయ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎ.రాజసింహుడు డిమాండ్ చేశారు. జాతీయ సంఘర్షణ సమితి పిలుపు మేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో రాస్తారోకో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస పెన్షన్ కోసం ఐదేళ్లుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగులందరికీ కనీస పెన్షన్ కరువు భత్యంతో కలిసి రూ.7,500 పెంచాలని, పెన్షనర్ల భార్య, భర్తలకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసనలో తెలంగాణ పెన్షనర్ల సెంట్రల్ అసోసియేషన్ నాయకులు సాయిలుగౌడ్, బాలకిషన్, అంజయ్యచారి, కృష్ణయ్య, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, నాయకులు నర్సింహులు, విజయ్‌కుమార్, శివస్వామి, కొండయ్య, చంద్రశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ అమలుకు డిమాండ్..

హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని కోరుతూ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఎస్‌ఏసీ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ గేటు ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ కోసం ఎన్నో ఏళ్ల నుంచి ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి బసిరెడ్డి, రీజినల్ కార్యదర్శి భగవంతు, నాయకులు అమీనుద్దీన్, రాంచంద్రయ్య, మజీద్‌ఖాన్, బుచ్చయ్య, ఫసియొద్దీన్ పాల్గొన్నారు.

సామాజిక సేవా ఉగాది పురస్కారం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ లక్ష్మీనారాయణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు ఆనంద్‌కుమార్‌కు జాతీయ సామాజిక సేవా రత్న ఉగాది పురస్కారం లభించింది. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో లిటిల్ చాంప్ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ ఉగాది పురస్కార కవితా సమ్మేళనం నిర్వహించారు. సినీనటుడు మాణిక్‌తేజ్, నిర్మాత మూర్తి, సంస్థ చైర్మన్ బుచెశ్వర్‌రావు చేతుల మీదుగా ఆనంద్ అవార్డును అందుకున్నారు. వివిధ రంగాల్లో చేసిన సామాజిక సేవలకు ఈ అవార్డును అందించినట్లు ఆనంద్‌కుమార్ తెలిపారు.




ఉగాది పురస్కారం అందుకుంటున్న ఆనంద్‌కుమార్

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారులో బుధవారం మధ్యాహ్నం బైక్ అదుపుతప్పి కిందపడడంతో బైక్‌పై ఉన్న మల్లాపూర్‌కు చెందిన మణ్యంకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన ప్రయాణికులు చికిత్స నిమిత్తం 108లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు.

అడవి జంతువు దాడిలో గేదెదూడలు మృతి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని చిన్నదర్పల్లి గ్రామం చిర్మల్‌కుచ్చతండా అటవీ శివారు ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో పశువుల పాకపై అడవి జంతువు దాడి చేయడంతో రెండు గేదెదూడలు మృతిచెందాయి. సయ్యద్ ఎక్బాల్ మైనొద్దీన్‌కు చెందిన గేదె దూడలు మృతిచెందిన విషయాన్ని వెటర్నరీ, ఫారెస్టు అధికారులకు తెలుపగా, సంఘటనా స్థలానికి చేరుకొని కౌన్సిలర్ లతశ్రీలక్ష్మణ్, రమేశ్‌నాయక్, గ్రామస్తుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. రూ.30వేలు విలువ చేసే గేదెదూడలు మృతిచెందినట్లు బాధితుడు పేర్కొన్నారు.



మృతిచెందిన గేదె దూడలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

పంచాయతీ కార్మికుల ధర్నా

దేవరకద్ర: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, 30శాతం పీఆర్‌సీ అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఇన్సూరెన్స్‌ను వర్తింపజేయాలని కార్మికులు డిమాండ్ చేస్తూ ధర్నాను చేపట్టారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేస్తూ మండల పరిషత్ కార్యాలయం చేరుకుని దాదాపు అరగంట పాటు ధర్నా నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు డ్రెస్సులు, మాస్కులు, గ్లౌజ్‌లు, బూట్లు, సబ్బు నూనెలు ఇవ్వడంతో పాటు సేఫ్టీ ప్రికాషన్ అమలు చేయాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి విడనాడాలని, వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను తీర్చాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘం నాయకులు వెంకట్‌రాములు, యాదయ్య, గణేశ్, కిష్టన్న, తిరుపతయ్య, మన్యం, సత్యమ్మ, లక్ష్మి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

గండీడ్: గ్రామాల్లో పారిశుద్ధ్యం, శానిటేషన్, సెగ్రిగేషన్ షెడ్ల వినియోగం, ఎరువుల తయారీపై మూడు రోజులుగా ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఏపీఓ హరిశ్చంద్రుడు, టీఏలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఆదిత్య నవోదయ గురుకుల కోచింగ్ సెంటర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం విద్యార్థులకు క్యారమ్స్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్‌లో తేజశ్విని, సాత్విక, నవీన్, క్యారమ్స్ పోటీల్లో అభిలాష్‌గౌడ్, అనిరుధ్‌గౌడ్, హరీష్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా వీరికి జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఇటీవలే నిర్వహించిన సౌతిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రంలోని వీరన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు సీనియర్ కరాటే మాస్టర్ సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు రూప, అనూష, సంజన పాల్గొని బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను బుధవారం వీరన్నపేట పాఠశాలలో హెచ్‌ఎం ఎ.వెంకటేశ్వర్లు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిప్రకాశ్, గోపాల్, శ్రీలత, భాస్కర్, చారి, శివలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

అరెస్టులకు భయపడేది లేదు

పాలమూరు: ప్రశ్నించేవారిపై అణచివేత ధోరణి కొనసాగుతున్నదని, అక్రమ అరెస్టులకు బీజేపీ కార్యకర్తలు భయపడరని పార్టీ యువమోర్చా జిల్లా ఇన్‌చార్జ్ బండి దీక్షిత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. నిరుద్యోగులకు అండగా నిలుస్తున్న బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు దుర్గాప్రసాద్, నవీన్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం



హన్వాడ: విద్యార్థులకు ఒంటిపూట బడులు ప్రారంభం కావడంతో విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమాన్ని ఎంపీపీ బాల్‌రాజు మండలంలోని కిష్టంపల్లిగేట్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రారంభించారు. హెచ్‌ఎం ప్రశాంత్ తన సొంత ఖర్చులతో ఈనెల 27వ తేదీ వరకు చిన్నారులకు అల్పాహారాన్ని అందించేందుకు ముందుకు రావడంపై హెచ్‌ఎంను అభినందించారు.

క్లుప్తంగా

వెండికలశం అందజేసిన మంత్రి



స్టేషన్ మహబూబ్‌నగర్: మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన తల్లిదండ్రులు శాంతమ్మ, నారాయణగౌడ్ జ్ఞాపకార్థం బుధవారం జిల్లా కేంద్రం కొత్తగంజ్‌లోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి వెండికలశం వితరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ సుందరీకరణ చైర్మన్ చంద్రమౌళి గుప్త, పోల శ్రీనివాస్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి దాతలు బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. జడ్చర్లకు చెందిన బొద్దు బుచ్చారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు బొద్దు అశోక్‌రెడ్డి, బొద్దు శ్రీనివాస్‌రెడ్డిలు స్వామి వారి గర్భాలయ ముఖ ద్వారాన్ని పంచలోహాలతో ఏర్పాటు చేయడానికి రూ.లక్ష చెక్కును ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్‌కు అందజేశారు. ఆలయాభివృద్ధికి కృషి చేసిన అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆలయం తరుపున సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని చైర్మన్ రమేష్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కారెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఆలయ ఉద్యోగి అనంతసేన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని నిమ్మబావిగడ్డకు చెందిన ప్రభాకరాచారి(60) మృతిచెందటంతో విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. పట్టణంలోని కార్పెంటర్ దుకాణాలను మధ్యాహ్నం వరకు మూసివేశారు. అంత్యక్రియల నిమిత్తం సంఘం ద్వారా రూ.6వేలను కుటుంబ సభ్యులకు సంఘ అధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షుడు రవీందర్‌చారి అందజేశారు. పరామర్శించిన వారిలో సంఘ సభ్యులు కృష్ణమాచారి, రామకృష్ణ, వెంకటేశ్, శ్రీశైలం సతీష్, శివ ఉన్నారు.

క్వారీ పనులు నిలిపివేయండి

చిన్నచింతకుంట: కురుమూర్తి గుట్టలో కొనసాగుతున్న క్వారీ పనులను వెంటనే నిలిపివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ సువర్ణరాజుకు వినతిపత్రం అందజేశారు. కురుమూర్తి గుట్ట వెనకాలో కొందరు అక్రమంగా గుట్టను తవ్వి రాళ్లను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దీంతో రైతుల పొలాల్లో దుమ్ము పడి ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. అధికారులు వెంటనే క్వారీ పనులు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భగవంతు, కురుమూర్తి, రవీంద్ర, గాండ్ల శేఖర్, జనార్దన్ ,శ్రీను, జైపాల్, వినోద్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

కోయిల్‌కొండ: గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అదేవిధంగా శ్మశానవాటిక నిర్మాణ పనులు, క్రీడామైదానాలు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలో గల కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని డీఈఓ యాదయ్య బుధవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనానికి వినియోగిస్తున్న వంట పదార్థాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభ పాఠవాల గురించి ఆరాతీశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారని ప్రశ్నించారు. ఎలాంటి బెరుకులేకుండా పరీక్షలు రాయాలని, మానసికంగా ధృడంగా ఉండాలని తెలిపారు.

వీఆర్ఏ కుమారుడిపై దాడి

మహమ్మదాబాద్: అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ట్రాక్టర్‌ను పట్టుకోబోయిన కంచన్‌పల్లి వీఆర్ఏ వెంకటయ్య కుమారుడు మారుతిపై ఇసుకాసురులు దాడికి పాల్పడినట్టు బాధితుడు తెలిపారు. మండలంలోని కంచన్‌పల్లి గ్రామ శివారుల్లో గత రెండు రోజుల కిందట అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ట్రాక్టర్ ద్వారా ఇసుకను త రలిస్తున్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మారుతిపై దాడికి పాల్పడి గాయపర్చారు. బాధితుడు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.







